సబితపై కరపత్రాల కలకలం

- మహేశ్వరం నియోజకవర్గంలో ఇంటింటికి పంపిణీ
- కార్పొరేటర్ శ్రీవాణి పేరిట విమర్శలు
- బీఆర్ఎస్ నేతల ఆగ్రహం.. కరపత్రాలు దహనం

మహేశ్వరం: స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సబితారెడ్డిపై సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి పేరిట వెలిసిన కరపత్రాలు కలకలం రేపాయి. అయితే.. ఈ కరపత్రాలపై బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. కరప్రతాలను దహనం చేశారు. దీంతో మహేశ్వరం నియోజకవర్గంలో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి. వివరాలు.. ఆదివారం తెల్లవారుజామున నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కార్పొరేటర్ శ్రీవాణి అనుచరులు కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేశారు. దాదాపు లక్షకు పైగా కరపత్రాలు పంపిణీ చేసినట్లు తెలిసింది. మహేశ్వరం నియోజకవర్గానికి మంత్రి సబిత చేసిందేమి లేదని, అభివృద్ధి మాట దేవుడెరుగు కానీ.. ఆమె ఆస్తులు మాత్రం బాగా పెంచుకున్నారని ఆరోపించారు. సరూర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి ఇప్పటివరకు ఎలాంటి నిధులు కేటాయించలేదని విమర్శించారు. ఇందుకుగాను వచ్చే ఎన్నికల్లో మంత్రిని ఓడించాలని అందులో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న మంత్రి అనుచరులు, బీఆర్ఎస్ నాయకులు.. కార్పొరేటర్ శ్రీవాణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ చౌరస్తాల్లో కరపత్రాలను దహనం చేశారు. శ్రీవాణికి వ్యతిరేకంగా, సబితకు అనుకూలంగా నినాదాలు చేశారు. పలు పోలీస్ స్టేషన్లలో శ్రీవాణిపై ఫిర్యాదు చేశారు.


మహేశ్వరం: కరపత్రాలను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శ్రీవాణి.. అభివృద్ధి గురించి నీకేం తెలుసు..?

మండల పరిధిలోని మన్సాన్‌పల్లిలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి కరపత్రాలను దహనం చేశారు. సోషల్ మీడియాకే పరిమితమవుతున్న శ్రీవాణి అభివృద్ధి, సంక్షేమం గురించి ఏం తెలుసని ప్రశ్నించారు. మంత్రి సబితపై అసత్య ప్రచారం చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

అసత్య ప్రచారం చేస్తే ఊరుకోం..

పహాడీషరీఫ్: మంత్రి సబితపై అసత్య ఆరోపణలు చేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్ కోరారు. ఈ మేరకు ఆదివారం పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. శ్రీవాణి మతిస్థిమితం కోల్పోయి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పద్ధతి మార్చుకోకుంటే ప్రజలే తరిమికొడుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బండారి గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు పీఎస్‌లో ఫిర్యాదు

కందుకూరు: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డిపై అసత్య ప్రచారాలు చేస్తూ లేఖల పంపిణీ చేపట్టిన సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కందుకూరు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... మంత్రిపై అసత్య ప్రచారాలు చేస్తే సహించేదిలేదని, ఇదే విధంగా కొనసాగితే భౌతికదాడులకు వెనకాడేదిలేదని హెచ్చరించారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నా బీజేపీ నాయకుల కళ్లకు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. శ్రీవాణికి దమ్ముంటే కందుకూరుకు వచ్చి మాట్లాడాలని, రోడ్డుపై అడ్డా కూలీలను పంపి లేఖలు పంచడం కాదన్నారు. కార్యక్రమంలో మీర్‌ఖాన్‌పేట ఎంపీటీసీ కాకి రాములు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సామ ప్రకాష్‌రెడ్డి, సామ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల కార్తీక్, మండల యూత్ అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్‌రెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, కాకి రవీందర్, రవికుమార్‌రెడ్డి, కాసోజు ప్రశాంత్‌చారి, రామకృష్ణ, సిద్దేశ్వర్‌గౌడ్, శ్రీధర్, తిరుపతిరెడ్డి, హనుమంత్‌రెడ్డి, నాగేష్, వినోద్, ఎమ్మార్పీఎస్ నాయకుడు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పహాడీ షరీఫ్ పీఎస్‌లో..

తుక్కుగూడ: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డిపై సరూర్‌నగర్ బీజేపీ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అసత్య ఆరోపణలు చేస్తున్నారంటూ ఆదివారం తుక్కుగూడ మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు ఆదివారం పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న మంత్రి సబితారెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఫిర్యాదు అందజేసిన వారిలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు జల్లాల లక్ష్మయ్య, కౌన్సిలర్ బాదావత్ రవినాయక్, నాయకులు శ్యామేల్ రాజు, బూడిద శ్రీకాంత్‌గౌడ్, పద్మ, సురేష్, బాకారం వెంకటరాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

సబితారెడ్డితో నియోజకవర్గానికి ఒరిగిందేమిటి?

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ ప్రజలు దాదాపు రూ.24 కోట్ల పన్నులు ప్రభుత్వానికి చెల్లించినా.. అభివృద్ధికి 24 రూపాయలు కూడా కేటాయించలేని దుస్థితిలో ఉందని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి విమర్శించారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు లేఖ రాశారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ.. ఈ రెండు సంవత్సరాల్లో డివిజన్ అభివృద్ధికి సంబంధించిన నిధుల కేటాయింపు కోసం అధికారులను, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సబితారెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు మొరపెట్టుకున్నా సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిధులు



కేటాయించకున్నా ఏ రోజు వెనుకడుగు వేయకుండా వినూత్న కార్యక్రమాలతో ప్రజలకు వాస్తవాలు తెలపాలని ఉద్దేశంతోనే లేఖలు రాస్తున్నట్లు తెలిపారు. సబితారెడ్డి గతంలో హోంమంత్రిగా ఉన్నప్పుడు, ఇప్పుడు విద్యాశాఖ మంత్రిగా ఉన్నా నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదని విమర్శించారు.

ఉచిత వైద్యశిబిరాలతో పేదలకు మేలు

మేయర్ పారిజాత


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు జరుగుతుంద బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత పేర్కొన్నారు. బడంగ్‌పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిమ ఆస్పత్రి వైద్యుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత హృద్రోగ పరీక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈసీజీ, 2డీ–ఈకో, జీఆర్‌బీఎస్ పరీక్షలు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఇలాంటి శిబిరాల్లో ఆరోగ్యపరీక్షలు చేయించుకుంటే రోగం అనేది ముందుగానే బయటపడిపోతుందని అన్నారు. తర్వాత ట్రీట్‌మెంట్ తీసుకుంటే రోగి నయం అయి పదికాలాలపాటు చల్లగా ఉంటాడని చెప్పారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బంగారు బాబు, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, మనోహర్, బాలునాయక్, మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, సుభాన్‌యాదవ్, మహిళా అధ్యక్షురాలు అమృతనాయుడు, గట్టు బాలకృష్ణ, సామ వరుణ్‌రెడ్డి, ఆవుల కృష్ణ, సూర్యగంటి విజయ్‌కుమార్, ప్రతిమ హాస్పిటల్ వైద్య సిబ్బంది డా.శ్వేత, కుతుబుద్దీన్ ఫరూక్, విక్రంగౌడ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అఖిల్‌రెడ్డికి కాంస్య పతకం



అఖిల్‌రెడ్డితో కోచ్ శివకేశవ్ యాదవ్

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరుకు చెందిన సర్గారి అఖిల్‌రెడ్డి జాతీయ సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. శనివారం తమిళనాడు రాష్ట్రం నాగర్‌కోయిల్‌లో జాతీయ స్థాయి సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. అందులో పురుషుల 109 కిలోల విభాగంలో బరిలోకి దిగిన అఖిల్ స్నాచ్‌లో 144 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 174 కిలోలు, మొత్తం 318 కిలోలు ఎత్తి తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. వెయిట్ లిఫ్టింగ్‌లో ముందుకు సాగేందుకు సర్వేజన సుఖినోభవంతు ఫౌండేషన్ మద్దతుగా నిలిచిందని ఈ సందర్భంగా అఖిల్‌రెడ్డి తెలిపాడు. తాను ఈ స్థాయిలోకి చేరుకోవడానికి కారణమైన కోచ్ శివకేశవ్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


ప్రత్యేక పూజలు చేస్తున్న నర్సింహారెడ్డి, నాయకులు

మహేశ్వరం: మండల పరిధిలోని హర్షగూడ గ్రామంలో ఆదివారం అయ్యప్ప భక్తులు మహాపడి పూజ, ఇరుముడి పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు చేసి భక్తి గీతాలు ఆలపించారు. పడిని కాల్చి ఇరుముడులతో అయ్యప్ప భక్తులు శబరిమలై తరలివెళ్లారు. కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, చిగురితం నర్సింహారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హర్షగూడ సర్పంచ్ వి.పాండునాయక్, ఉపసర్పంచ్ జే.రవినాయక్, ఎంపీటీసీ విజయ్‌కుమార్ నాయక్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

కుర్మల్‌గూడలో మహిళా సమైక్య సమావేశం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైఖ్య(ఏఐఎఫ్‌డీడబ్ల్యూ) బాలాపూర్ మహిళా సమైక్య ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న బీఎన్‌రెడ్డి శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యులు పాల్గొననున్న ఈ ఉత్సవాల్లో బీఎస్‌రెడ్డి కమ్యూనిస్టులకు, సమాజానికి చేసిన సేవలను వక్తలు విషయపరుస్తారని అన్నారు. మహిళా సమైఖ్య మండలి, గ్రామ, మండల సమైఖ్య మండల కమిటీలు శతజయంతి ఉత్సవాలు విజయవంతం చేసేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బొద్రమోని సుజాత, ఎం.అరుణ, స్వరూప, నాగేంద్రమ్మ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు సన్మానం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీ అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్రశేఖర్‌ను కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ... వాసవికాలనీ, వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో ఆధ్యాత్మికను పెంపొందించడానికి చంద్రశేఖర్ ఎంతో కృషి చేశారన్నారు. కాలనీ నాయకులు అయిత అంజయ్య, శ్రీధర్, సి.ఉపేందర్‌రెడ్డి, కృష్ణయ్య, రామస్వామి, కృష్ణమూర్తి, అనీల్, శ్రీకాంత్, రాజు, వీరారెడ్డి, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజేష్‌కు జాతీయ విశిష్ట సేవా పురస్కారం


రాజేష్‌ను సన్మానిస్తున్న అతిథులు

దిల్‌సుఖ్‌నగర్: పుడమి సాహితీ వేదిక తెలంగాణ నాలుగవ వార్షికోత్స వేడుకలు నల్లగొండ చిట్యాలలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్‌లో పుడమి సాహితీ వేదిక జాతీయ అధ్యక్షుడు చిలుమూరి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని విద్యా, వైద్య, కళా, సామాజిక రంగాలలో మూడు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న వారిని సన్మానించారు. అందులో ఆర్‌కేపురంలోని అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్‌కు పుడమి సాహితీ జాతీయ విశిష్ట సేవా పుస్కారం –2023ను ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీనాథ మహాకవి వారసులు డాక్టర్ శ్రీనివాస శర్మ, పుడమి సాహితి జాతీయ అధ్యక్షుడు బాల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో భక్త రామదాసు వారసులు కంచర్ల శ్రీనివాసరావు, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత డాక్టర్ సుబ్రమణ్యం, శివశంకరయ్య, చిట్యాల మున్సిపల్ చైర్మన్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీపీఎల్ పోటీలు ప్రారంభం

మహేశ్వరం: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ మద్ది కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో టీపీఎల్–8 (తుమ్మలూరు ప్రీమియర్ క్రికెట్ లీగ్) పోటీలను ఆయన స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, ఉప సర్పంచ్, వార్డుసభ్యులు, క్రీడాకారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలు శారీరక ధారుఢ్యం, మానసికోల్లాసం కల్గిస్తామన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోటా ఇచ్చి ప్రోత్సహిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వివిధ క్రీడల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు. యువత అన్ని రంగాల్లో ముందుండాలని ఆయన సూచించారు. ఇండియన్ ప్రీమియర్ క్రికెట్ లీగ్(ఐపీఎల్) వలే తుమ్మలూరు ప్రీమియర్ లీగ్(టీపీఎల్) పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణా ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు. అంతకు ముందు టాస్ వేసి టీపీఎల్ పోటీలను ఆయన ప్రారంభించారు. మైదానంలో క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడి అలరించారు. ఈ కార్యక్రమంలో తుమ్మలూరు గ్రామ సర్పంచ్ మద్ది సురేఖారెడ్డి, ఉప సర్పంచ్ కటికెల శ్రీహరి ముదిరాజ్, ఎంపీటీసీ మద్ది రామిరెడ్డి, బీఎస్పీ సినీయర్ నాయకులు అందుగుల సత్యనారాయణ, వార్డు సభ్యులు గోవర్ధన్ చారి, శ్రీధర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గంట వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు విద్యాసాగర్, తులసిరెడ్డి, శివ, పర్వతాలు, ఎండీ.మహబూబ్, ఆర్గనైజర్ సుభాష్, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కరుణాకర్‌రెడ్డి

వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం: కాంగ్రెస్

హయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లోని లోపాలను, అధికార పార్టీ నాయకులు చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం తొర్రూర్‌లో నిర్వహించిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26 నుంచి పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు అని చెప్పుకుని ఇంట్లో కూర్చుంటే ప్రయోజనం ఉండదని, పార్టీ సమావేశాలకు కూడా చాలామంది హాజరుకావడం లేదని డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుండ్లపల్లి ధన్‌రాజ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జయమ్మ, జెడ్పీటీసీ సభ్యులు బింగిదాసుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రంగవల్లులు మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక

మీర్‌పేట: రంగవల్లులు తెలుగువారి సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని మీర్‌పేట కార్పొరేషన్ 9వ డివిజన్ కార్పొరేటర్ పెండ్యాల శివపార్వతి తెలిపారు. ఆదివారం నందిహిల్స్ ఫేజ్–1 అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో సుమారు 100 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని వేసిన రంగు రంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి కార్పొరేటర్ శివపార్వతి ముఖ్య అతిథిగా హాజరై మొదటి విజేతకు రూ.3వేలు, ద్వితీయ విజేతకు రూ.2వేలు, తృతీయ విజేతకు రూ.1000 బహుమతిగా అందజేయడంతో పాటు పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ, కాలనీ అధ్యక్షులు వెంకటేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, నగేష్ యాదవ్, దుర్గయ్య, జగన్మోహన్‌రావు, న్యాయవాద పరిషత్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ తిరుపతిరెడ్డి, నర్సింహారెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.


విజేతకు బహుమతి అందజేస్తున్న అతిథులు

ఎంసీఆర్ కాలనీలో వేడుకలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని ఎంసీఆర్ కాలనీలో ఆదివారం బ్రాహ్మణ మహిళా సేవాసమితి ఆధ్వర్యంలో రంగవల్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గులు, పాటల పోటీలు, మ్యూజికల్ చైర్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో జ్యోతి, సుగుణ, విజయ, మధిర, పద్మావతి, సాయి, అనూష, శైలజ, నీరజ, లక్ష్మీ, రాధ, మీరా, శ్రీగాయత్రి సేవా ట్రస్ట్ చైర్మన్ గుంగెపూడి రమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

కడ్తాల్: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కడ్తాల్ పట్టణానికి చెందిన కాలే చిన్నా ప్రమాదానికి గురై హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమస్యను స్థానిక సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో ఎమ్మెల్యే సహకారంతో రూ.1లక్ష సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరయింది. ఈ చెక్కును ఆదివారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింహ, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి సహకరించండి

డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లోని పెద్ద చెరువు సుందరీకరణ పనులను డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ ఆదివారం సందర్శించారు. చెరువుకట్ట ఎలా వెడల్పు చేస్తున్నారో పరిశీలించారు. మత్స్యకారులతో పాటు సబ్బండ వర్గాలకు ఊతం ఇస్తున్న చెరువులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అందులో భాగంగానే తెలంగాణ ప్రభుత్వం చెరువుల సుందరీకరణ కోసం సుమారు రూ.3 కోట్లు విడుదల చేసి పనులు ప్రారంభించడం సంతోషమన్నారు. చెరువుల బ్యూటిఫికేషన్స్‌కు చెరువుకు ఆనుకుని ఉన్న పట్టాదారులు, భూ యజమానులు సహకరించి అభివృద్ధికి ఆటంకం లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పోరెడ్డి వెంకట్‌రెడ్డి, తిమ్మని గిరీష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

చరిత్ర ఘనం.. అభివృద్ధి శూన్యం

- దూపదీప నైవేద్యాలకు నోచుకోని రంగనాయకుల స్వామి దేవస్థానం
- రూ.వంద కోట్లకు పైగా ఆస్తులున్నప్పటికీ చిన్నచూపు
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలంటున్న భక్తులు


మామిడిపల్లిలోని రంగనాయకుల ఆలయానికి వెళ్లే మెట్ల మార్గం

పహాడీషరీఫ్: వందల ఏళ్ల ప్రాచీన చరిత్ర కలిగిన మామిడిపల్లి రంగనాయకుల స్వామి దేవస్థానం దూపదీప నైవేద్యాలకు నోచుకోవడం లేదు. కోరిన కోరికలు తీర్చుతూ భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్నప్పటికీ కనీస ప్రాచూర్యం పొందడం లేదు. వంద కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉండటంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో స్వయం:భుగా వెలసిన ఈ ఆలయాన్ని తీర్చిదిద్దాలని భక్తజనం కోరుకుంటున్నారు. ఒకప్పుడు భారీ చెట్ల పొదలతో అటవీ ప్రాంతం మధ్యలో ఉన్న ఈ ఆలయానికి భక్తులు వెళ్లేందుకు ఇటీవలే రోడ్డు మార్గం కూడా ఏర్పాటుచేశారు. చుట్టూ పచ్చని చెట్లు... కొండగట్లతో ప్రశాంత వాతావరణాన్ని కలిగి ఉన్న ఈ ఆలయ ప్రాశస్త్యాన్ని ముందుకు నడిపించాలని భక్తజనం కోరుతున్నారు.

మైమరిపించే స్వామివారి రూపం..

స్వయం:భుగా వెలసిన స్వామివారి రూపమే ఇక్కడ ఎంతో ప్రత్యేకత. పడుకొని దర్శనమిచ్చే స్వామివారిని చూసే భక్తులు మళ్లీమళ్లీ చూస్తూ తరించిపోతారు. స్వామివారి కాళ్లకు సేవకులు సపర్యలు చేస్తుండగా.... స్వామివారి కాళ్లకు దిగువ భాగంలో లక్ష్మీదేవి కొలువుదీరారు. స్వామి ఎదురుగా ఆంజనేయస్వామి విగ్రహం కూడా స్వయం:భుగా కొలువుదీరి ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ముందు భాగంలో భైరవస్వామి కూడా కొలువుదీరారు. స్వామివారి ఆలయం కింద భారీ కొలన్ కూడా ఉంది. ఈ కొలన్‌లో అన్ని వేళల్లో నీరు సమృద్ధిగా ఉంటాయి. కొండపై వెలసిన ఆలయానికి భక్తులు వెళ్లేందుకు మెట్లు నిర్మాణం చేశారు. ఆలయం చుట్టూ మర్రి, రావిచెట్లు ఉండటంతో ఇక్కడికి వచ్చే భక్తులు చల్లటి నీడలో సేద తీరుతారు.

దీపావళి అనంతరం బ్రహ్మోత్సవాలు..

ప్రతి ఏటా దీపావళి ముగిసిన ఎనిమిదో రోజు కన్నుల పండువగా స్వామివారి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. ఈ ఉత్సవాలకు మామిడిపల్లి, జల్‌పల్లి, పహాడీషరీఫ్ గ్రామాల భక్తులే కాకుండా బేగంబజార్, ఘాన్సీబజార్, సికింద్రాబాద్, బేలా, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల నుంచి మార్వాడీలు పెద్దఎత్తున తరలివస్తారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కార్తీక, శ్రావణ మాసాలలో కూడా ఈ ఆలయంలో భక్తులు పెద్దఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. స్వామివారు కొలువు దీరిన కొండ వెనుక భాగంలో ఉన్న ప్రత్యేకమైన శివలింగానికి శివరాత్రి రోజున పెద్దఎత్తున పూజలు నిర్వహిస్తారు.

స్వామివారి పేరుతో కాలనీ..

15.23 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రంగనాయకుల స్వామి వారి ఆలయం పేరు మీదుగానే పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ సమీపంలో «రంగనాయకుల కాలనీ» సైతం ఏర్పాటయ్యింది. దాదాపు 30 ఏళ్ల క్రితం ఏర్పాటైన ఈ కాలనీలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు నివాసం ఉంటున్నారు. స్వామి వారి ఆలయ రూట్‌లో బస్తీ ఏర్పడినందుకు గాను దీనికి రంగనాయకుల కాలనీ అని నామకరణం చేసుకున్నారు. ఈ కాలనీ ప్రజలు కూడా ప్రతివారం ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి..

ఎంతో ప్రాచీనమైన ఆలయం, ఆపై చుట్టూ భారీ వృక్షాలు, ఎత్తైన కొండలు, కూతవేటు దూరంలో రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం. ఇన్ని సదుపాయాలు కలిగి ఉన్న ఈ ఆలయం సరైన నిర్వహణ లేని కారణంగా కనమరుగైపోయే ప్రమాదం ఉంది. పైగా ఆలయ భూములను కాజేసేందుకు ఇప్పటికే చాలామంది ట్రై చేస్తున్నట్లు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో దేవాదాయ శాఖ అధికారులు ఫిర్యాదు సైతం చేశారు. కొండపై వెలసిన ఈ ఆలయానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేసినట్లయితే ఈ ఆలయాన్ని మంచి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దవచ్చని గ్రామస్తులంటున్నారు. దేవాదాయ శాఖతో పాటు దాతలు ముందుకొస్తే మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం మాదిరిగానే ఈ ఆలయం కూడా విశిష్టతను సంతరించుకుంటుందంటున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

బీజేపీ నేత అందెల శ్రీరాములు

బడంగ్‌పేట్: యువత క్రీడల్లో రాణించి సొంత ఊరికి, రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తీసుకొనిరావాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ టి.భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటాపోటీగా జరిగిన ఈ పోటీల్లో జీఎస్ఎంయూఆర్ఎం (గృహకల్ప సముదాయం) జట్టు విజేతగా నిలిచింది. ముగింపు కార్యక్రమానికి అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొని విజేతలకు, రన్నరప్‌కు, మిగిలిన జట్లకు బహుమతులు, ప్రశంసాపత్రాలు, నగదును అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, దశరథ్‌గౌడ్, సంతోష్, భరత్, భాస్కర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న అందెల

క్రీడాకారులకు ప్రోత్సాహం

మహేశ్వరం: క్రీడాకారుల ప్రోత్సాహానికి తన వంతు సహాయం చేస్తానని హర్షగూడ ఉప సర్పంచ్ జె.రవి నాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని హర్షగూడ గ్రామంలో యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు, టోర్నమెంట్ నిర్వహణ ఖర్చులకు తన సొంత నిధులు లక్ష రూపాయలు స్పాన్సర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో ప్రతిభ ఉన్న గ్రామీణా క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. హర్షగూడ గ్రామంలో ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సాయం చేసి అదుకుంటున్నామని చెప్పారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామంలో ఆలయాల నిర్మాణానికి, యువజన సంఘాల బలోపేతం కోసం తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తూ ముందుంటున్నానని తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.28,000, రెండవ బహుమతి 23,000, మూడవ బహుమతి రూ.5,000, నాలుగోవ బహుమతి రూ.5,000 క్యాష్ ప్రైజ్‌లను విన్నర్, రన్నర్ జట్లకు ఆయన అందజేశారు. అనంతరం ఉప సర్పంచ్ రవినాయక్‌కు హర్షగూడ యూత్ క్లబ్ సభ్యులు, క్రీడాకారులు ఘనంగా సన్మానించారు.

విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం విఫలం

ఆమనగల్లు: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు కందడి శ్రీరామ్ ఆరోపించారు. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని ఆయన ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఏబీవీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కందడి శ్రీరామ్ విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజులు, స్కాలర్‌షిప్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.3,800 కోట్లు విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మల్లేశ్, భరత్, శివ, సురేశ్, శ్రీధర్, నరేశ్, శివాచారి, శంకర్ పాల్గొన్నారు.